సాక్షి
గుంటూరు

సోమవారం, 19, జూన్, 2023



మహంకాళి గుడికి విరాళం

తాడేపల్లిరూరల్: కంఠంరాజు కొండూరులోని మహంకాళి గుడికి విజయవాడకు చెందిన బసవేశ్వరరావు, శేషారత్నం దంపతులు ఆదివారం రూ.1,00,116 విరాళం అందించారు.



లక్ష్మీనృసింహస్వామి దర్శనం

మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి, రాజ్యలక్ష్మి అమ్మను దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ఆదివారం దర్శించారు.

అంజన్నకు దశ సహస్ర కదలీఫలార్చన



అద్దంకి: బాపట్ల జిల్లా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో మూల విరాట్టుకు ఆదివారం అమావాస్య సందర్భంగా దశ సహస్ర కదలీ ఫలార్చన నిర్వహించారు. తరువాత 10 వేల అరటి పండ్లతో పూజచేశారు.

న్యూస్‌రీల్

బగళాముఖి అమ్మ సేవలో హైకోర్టు జడ్జి సుబ్బారెడ్డి



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి ఆలయంలో శనివారం రాత్రి 52వ దివ్య అమావాస్య హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వీరితోపాటు బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి సాధుబాబు, జూనియర్ సివిల్ జడ్జి రుక్మిణి ఉన్నారు. బాపట్ల సీఐ కృష్ణయ్య, చందోలు ఎస్ఐ రాజశేఖర్ బందోబస్తు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి న్యాయమూర్తి దంపతులకు ఆలయ విశేషాల గురించి వివరించారు. అమ్మవారి శేషవస్త్రాన్ని, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కంచర్ల అవినాష్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 520.10 అడుగుల వద్ద ఉంది. ఇది 149.4580 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.10 అడుగుల వద్ద ఉంది. ఇది 33.8136 టీఎంసీలకు సమానం.

ఎంఈఓ-2 పోస్టులు 57 భర్తీ

ఉమ్మడి గుంటూరు జిల్లాలో వెల్దుర్తి మినహా అన్ని మండలాలకు నియామకం



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎంఈఓ-2 పోస్టులు 57 భర్తీ అయ్యాయి. ప్రభుత్వం మంజూరు చేసిన రెండో ఎంఈఓ పోస్టులను భర్తీ చేసేందుకు ఆదివారం గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో భాగంగా మొత్తం 58 పోస్టులకు వెల్దుర్తి మినహా మిగిలిన 57 పోస్టులను అర్హులైన హెచ్ఎంలతో భర్తీ చేశారు. ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, డీఈఓ పి.శైలజ పర్యవేక్షణలో జరిగిన కౌన్సెలింగ్‌లో భాగంగా ప్రస్తుతం పని చేస్తున్న ఎంఈఓల్లో ఆరుగురు ఎంఈఓ-2 పోస్టుల్లో నియమితులయ్యేందుకు ఆసక్తి కనబర్చారు. 13 మంది జెడ్పీ యాజమాన్యంలోని ఎంఈఓలు, హెచ్ఎంలతోపాటు మరో 44 మంది గ్రేడ్-2 హెచ్ఎంలు రెండో ఎంఈఓలుగా నియమితులయ్యారు. కాగా ఎంఈఓలుగా వెళ్లిన సంబంధిత 44 గ్రేడ్-2 హెచ్ఎం పోస్టులను స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేయనున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఏడీ నిర్మలారాణి, సీనియర్ హెచ్ఎంలు ఎ. తిరుమలేష్, ఎస్వీ ప్రసాద్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో వరుణ జపాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక సంరక్షణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ, వరుణ జపాలు జరిగాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. అలాగే ప్రకృతి శాంతించాలని, ఎండ వేడిమి తగ్గి వర్షాలు కురవాలని సంకల్పిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో వరుణ జపాలు, రుద్రపారాయణ జరిపించారు. దేవదాయ శాఖ మంత్రి సత్యనారాయణ, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు విరాట్ పర్వం పారాయణ, వరుణ జపాలు, రుద్ర పారాయణ చేయడం జరిగిందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

'విజేఈఈ' భేరి

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో గుంటూరు విద్యార్థుల సత్తా



ఓపెన్ కేటగిరీలో 5వ ర్యాంకర్ ఏవీ శివరామ్ జన్మదినం కావడంతో కేకు తినిపిస్తున్న తల్లి కళావతి, పక్కన భాష్యం రామకృష్ణ, ఇతర ర్యాంకర్లు



ఓపెన్ కేటగిరీలో 10వ ర్యాంకు సాధించిన వైవీ మణీందర్‌రెడ్డికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు అనురాధ, శ్రీనివాసరెడ్డి

- ఉమ్మడి గుంటూరు జిల్లా చరిత్రలో తొలిసారి ఓపెన్ కేటగిరీలో 5వ, 10వ ర్యాంకులు
- ఆలిండియా ర్యాంకులతో దుమ్మురేపిన ఫైనం
- అందరి లక్ష్యం ఐఐటీల్లో కంప్యూటర్ సైన్స్ చదవడమే

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా చరిత్రలో తొలిసారి ఇద్దరు విద్యార్థులు ఓపెన్ కేటగిరిలో టాప్-10లో నిలిచి జయభేరి మోగించారు. ఇప్పటివరకు పొరుగు రాష్ట్రాలకే పరిమితమైన ఓపెన్ కేటగిరీ టాప్-10 ర్యాంకుల్లో పాగా వేసి ఆంధ్రప్రదేశ్ బావుటాను సగర్వంగా ఎగరేశారు. కృషి, పట్టుదల వల్లే ఇది సాధ్యమైందని వారు ముక్తకంఠంతో చెబుతున్నారు. చిలకలూరిపేటకు చెందిన అడ్డగడ వెంకట శివరామ్ ఓపెన్ కేటగిరీలో 5వ ర్యాంకు, గుంటూరుకు చెందిన యక్కంటి ఫణి వెంకట మణీందర్‌రెడ్డి పదో ర్యాంకు సాధించి విద్యావినీలాకాశంలో మిలమిలా మెరిశారు. ఇంకా చాలా మంది వివిధ కేటగిరీల్లో మెరుగైన ర్యాంకులు కైవసం చేసుకున్నారు. వీరిలో ఎక్కువ మంది ఐఐటీల్లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ చదవాలనే లక్ష్యంతో ఉన్నారు. ఈ విజయానందం వారి మాటల్లోనే ..

రోజుకు 13 గంటలు చదివా



6వ ర్యాంకు

పేరు : కె.లక్ష్మీసూర్య.
కేటగిరి : ఓబీసీ

మా స్వస్థలం అనకాపల్లి జిల్లా కేజేపురం. నాన్న చిన్నప్పల నాయుడు వ్యవసాయం చేస్తున్నారు. 7వ తరగతి నుంచి గుంటూరులోనే హాస్టల్‌లో ఉండి ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ పొందాను. జేఈఈ మెయిన్స్‌లో 94వ ర్యాంకు, అడ్వాన్స్‌డ్ ఓపెన్ కేటగిరీలో 53వ ర్యాంకు సాధించాను. రోజుకు 13 గంటలు చదివాను. కాన్సెప్ట్ ఓరియెంటెడ్ బోధన. వీక్లీ టెస్టులు మెరుగైన ర్యాంకు సాధనకు దోహదం చేశాయి. ముంబై ఐఐటీలో సీఎస్ఈలో చేరతాను.

నాన్న కష్టానికి దక్కిన ఫలం



7వ ర్యాంకు

పేరు : పి.నిశ్చల్ సుభాష్
కేటగిరి : ఈడబ్ల్యూఎస్

ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న నాన్న రవి నన్ను చదివించేందుకు ఎంతో కష్టపడుతున్నారు. ఆయన కష్టానికి ప్రతిఫలం ఇది. మా సొంతూరు తణుకు. చిన్నప్పటి నుంచి గుంటూరులోనే చదువుతున్నా. ఐఐటీలో చదవాలనే లక్ష్యంతో కళాశాలలో తరగతులను సద్వినియోగం చేసుకుని, ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకోవడం ద్వారా మెరుగైన ర్యాంకు పొందాను. ఓపెన్ కేటగిరీలో 153వ ర్యాంకు సాధించాను. ముంబై ఐఐటీలో సీఎస్ఈలో చేరతాను.

సొంతంగా కంపెనీ స్థాపిస్తా



87వ ర్యాంకు

పేరు : బి.లోకేష్‌రెడ్డి
కేటగిరి : ఓపెన్

గుంటూరులోని కొరిటెపాడులో ఉంటున్నాం. నాన్న శ్రీనివాసరెడ్డి మిర్చి వ్యాపారి. ఏపీ ఈఏపీసెట్‌లో 257, తెలంగాణ ఎంసెట్‌లో 118వ ర్యాంకు సాధించాను. జేఈఈ మెయిన్స్‌లో 162వ ర్యాంకు పొందాను. ఐఐటీలో విద్యను అభ్యసించిన తరువాత సొంతంగా కంపెనీ స్థాపించాలనే లక్ష్యంతో ఉన్నాను.

నాన్న ఆశయం నెరవేరుస్తా



216వ ర్యాంకు

పేరు : సూరా వెంకట శైలజ
కేటగిరి : ఈడబ్ల్యూఎస్

నాన్న వెంకట నారాయణ గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లో రోడ్డు పక్కన మసాలా బండి నడుపుతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా నన్ను ఉన్నత విద్యావంతురాలిగా చూడాలనే ఆశయంతో చదివిస్తున్నారు. హైదరాబాద్ ఐఐటీలో బీటెక్ పూర్తి చేసిన తరువాత విదేశాలకు వెళ్లి ఎంఎస్ చదవాలనే లక్ష్యంతో ఉన్నాను.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆసక్తి



2000వ ర్యాంకు

పేరు : కె. శరవణార్జున్,
కేటగిరి : ఓపెన్ కేటగిరీ

మాది గుంటూరు. నాన్న శ్రీనివాస్ స్ట్రక్చరల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. తాతయ్య సుబ్బారావు గతంలో హిందూ కళాశాలలో గణితశాస్త్ర విభాగాధిపతిగా పని చేశారు. పాఠశాలస్థాయి నుంచే ఐఐటీ ఫౌండేషన్‌లో శిక్షణ తీసుకుంటున్నా. ఐఐటీ మద్రాస్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో చేరతాను.

అమ్మానాన్నలు ప్రైవేటు ఉపాధ్యాయులు



21వ ర్యాంకు

పేరు : ఎం.శ్రీవిష్ణుష్,
కేటగిరి : ఈడబ్ల్యూఎస్

అమ్మానాన్న శ్రీలక్ష్మి, ఆంజనేయులు ప్రైవేటు స్కూల్లో ఉపాధ్యాయులు. కృషి, పట్టుదల వల్ల మెరుగైన ర్యాంకు సాధ్యమైంది. మాది పెదకూరపాడు . ఓపెన్ కేటగిరీలో 265వ ర్యాంకు పొందాను. బీటెక్ తరువాత ఉన్నతస్థాయి ఉద్యోగంలో చేరడమా, లేక ఎంఎస్ చదవాలా అనేది నిర్ణయించుకుంటాను.

ముంబై ఐఐటీలో చదవాలన్నది లక్ష్యం



29వ ర్యాంకు

పేరు : ఐ.హర్షిత,
కేటగిరి : ఈడబ్ల్యూఎస్

మా స్వస్థలం రేపల్లె సమీపంలోని కారుమూరు గ్రామం. నాన్న వెంకటేశ్వరరావు వ్యవసాయం చేస్తున్నారు. అమ్మ అనురాధ గృహిణి. మెరుగైన ర్యాంకు సాధన దిశగా కష్టపడ్డాను. ముంబై ఐఐటీ సీఎస్ఈలో చదవాలనే లక్ష్యంతో ఉన్నాను. కష్టపడి చదివి ఉన్నత స్థానం సాధిస్తాను.

ఐఐటీలో చదువుతా



58వ ర్యాంకు

పేరు : మొగిలి ఆదిత్య
కేటగిరి : ఎస్టీ

మాస్వస్థలం మార్టూరు. నాన్న సురేష్ రవాణా వాహనానికి డ్రైవర్‌గా పని చేస్తున్నారు. మెయిన్స్‌లో 73 శాతం పర్సంటైల్ సాధించాను. అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు వచ్చింది. ఆనందంగా ఉంది. ఐఐటీలో చదవాలనే ఆశయంతో ఉన్నాను. ఇంకా బాగా చదివి ఉన్నతస్థానానికి ఎదుగుతా.

కుల రాజకీయాలకు చంద్రబాబు కుట్ర

- జగనన్న పాలనలో బీసీ కులాలకు అమిత ప్రాధాన్యం
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, పక్కన ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

చెరుకుపల్లి: కుల రాజకీయాలు చేసి లబ్ధిపొందేందుకు కుట్రలు చేయడం టీడీపీ అధినేత చంద్రబాబుకు, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు అలవాటేనని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. మండలంలోని ఉప్పాలవారిపాలెం గ్రామంలో ఇటీవల హత్యకు గురైన అమర్‌నాథ్ కుటుంబ సభ్యులను ఆదివారం జోగి రమేష్ పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అమర్‌నాథ్ మృతిని అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధిపొందేందుకు చంద్రబాబు కుట్రలకు తెరతీయడం, ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ప్రవర్తన సిగ్గు చేటని పేర్కొన్నారు. దురదృష్ట ఘటనలను అడ్డుపెట్టుకొని చంద్రబాబు కులాల రంగుపూయడం మానుకోవాలని హితవుపలికారు. గౌడ కులస్తులను, బీసీలను చంద్రబాబు గతంలో ఎలా మోసం చేశారో అందరికీ తెలుసని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాల అమలులో కులాలు చూడడం లేదని స్పష్టం చేశారు. సంక్షేమ ప్రభుత్వంపై చంద్రబాబు అండ్ కో బురద జల్లేందుకు యత్నిస్తోందని, ఇందులో కుల సంఘాల నాయకులు పావులుగా మారకూడదని హితవుపలికారు. బీసీలకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యమిస్తున్నారని, అందరూ జగనన్నకు అండగా నిలవాలని కోరారు. అమర్‌నాథ్ మృతి తర్వాత ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ఆ కుటుంబానికి అండగా నిలిచారని గుర్తు చేశారు. ఘటన జరిగిన వెంటనే పోలీసులను అప్రమత్తం చేయటంతోపాటు బాధిత కుటుంబానికి అండగా నిలిచారన్నారు. అమర్‌నాథ్ హత్య అమానుషమని జోగి పేర్కొన్నారు.

కుట్రలకు ప్రతిరూపం అనగాని : మోపిదేవి

టీడీపీ అధికారంలో ఉండగా గుడ్డికాయలంకకు చెందిన గౌడ కులానికి చెందిన వ్యక్తిని పోలీసులు లాకప్ డెత్ చేస్తే అప్పటి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు తొత్తుగా పనిచేస్తున్న సీఐని రక్షించి బాధిత కుటుంబానికి అన్యాయం చేయటం రేపల్లె నియోజకవర్గ ప్రజలు మరువలేదని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు విమర్శించారు. పేటేరులో గౌడ కులానికి చెందిన వ్యక్తిని హత్య చేస్తే నేరస్తులకు అండగా నిలిచిన చరిత్ర అనగాని సత్యప్రసాద్‌దని గుర్తు చేశారు. అడవులదీవిలో గౌడ కులానికి చెందిన వ్యక్తిని హత్య చేస్తే బాధ్యులైన వారికి సహకరించింది అనగాని కాదా అని ప్రశ్నించారు. అలాగే ఇటీవల పట్టణంలో టీడీపీకి చెందిన కౌన్సిలర్‌ను ఆపార్టీ నాయకులే హత్య చేస్తే హంతకులకు వెన్నుదన్నుగా నిలిచిన నీచ సంస్కృతి అనగానిదని ధ్వజమెత్తారు. కుట్రలకు ప్రతిరూపం అనగాని అని దుయ్యబట్టారు. అమర్‌నాథ్ హత్య పాశవిక చర్యని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాగాన్ని కోరినట్టు మోపిదేవి వివరించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, నేతలు కామినేని కోటేశ్వరరావు, బొర్రా శ్రీనివాసరావు, చెన్ను కోటేశ్వరరావు, తాతా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. భక్తులకు ఆలయంలో మజ్జిగ పంపిణీ చేశారు.

అర్చకులకు ప్రత్యేక విధులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించే పవిత్ర సారె, శాకంబరీదేవి ఉత్సవాలలో అర్చకులకు ఆలయ ఈవో భ్రమరాంబ ప్రత్యేక విధులను కేటాయించారు. పవిత్ర సారెను పురస్కరించుకొని మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి వద్ద నాలుగు షిఫ్టులలో అర్చకులకు విధులను కేటాయించగా, మొదటి బ్యాచ్‌లో బి. ప్రవీణ్, పీవీ రఘునాథ శర్మలకు, రెండో బ్యాచ్‌లో ఐపీ రాజశేఖర్, యూవీఎస్ఎం శాస్త్రిలకు, మూడో బ్యాచ్‌లో యజ్ఞనారాయణ శర్మ, కె. శేఖర్‌లకు, శంకరమంచి శ్రీనివాసు, కలపతపు పవన్‌కుమార్‌లకు విధులు కేటాయించారు. వేద పండితులు వి. రామనాథ ఘనాపాటి, కుచిభట్ల నరసింహామూర్తి, సన్నిధానం భావన్నారాయణ, ఆర్‌వీఎస్ యాజులు, ఇంకొల్లు రామకృష్ణ, వీరబొట్ల ఫణి, చిట్టిచంద్రశేఖర్‌లతో పాటు పలువురి సిబ్బందికి విధులు కేటాయించారు. శాకంబరీదేవి ఉత్సవాలలో అలంకారం నిమిత్తం కేఎన్‌వీడీ ప్రసాద్, యు. మురళీధర శాస్త్రి, ఎల్. భవానీప్రసాద్, సీహెచ్ పిచ్చయ్య శాస్త్రిలకు విధులు అప్పగించారు. మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి అలంకరణను ఉండి శ్రీనివాసశాస్త్రి, డీవీఎస్ రమేష్‌లు చూసుకోవాల్సి ఉంది.


పెద్దాసుపత్రికి 'జీవ'సత్వాలు

జీజీహెచ్‌కు అత్యాధునిక పరికరాలు

- రూ. 60 కోట్ల పరికరాలు పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఆపరేషన్లు

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు శ్రీనివాసరావు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం అన్నవరం గ్రామానికి చెందిన ఇతను లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. నెలరోజులుగా కడుపునొప్పి, తీవ్ర వాంతులు, ఇతర అనారోగ్య కారణంతో బాధపడుతూ గుంటూరు జీజీహెచ్‌కు మే 17న వచ్చాడు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు పరీక్షలు చేసి రక్తనాళాలు, ప్యాంక్రియాస్ ఉబ్బి ఉండటం, ప్లీహదమని సూడో ఎమ్యూరిజం ఉండటాన్ని గుర్తించి మే 24న అత్యాధునిక ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ పరికరంతో కోత, కుట్లు లేకుండా ఆపరేషన్ చేసి, వ్యాధి నుంచి విముక్తి చేశారు.





జీజీహెచ్‌కు మంజూరు చేసిన రూ. 18 కోట్ల విలువ చేసే లీనియర్ యాక్సిలేటర్



రూ. 2 కోట్లు ఖరీదు చేసే యూరాలజీ వైద్య పరికరం

గుంటూరు మెడికల్: రాష్ట్రంలో పేదల పెద్దాసుపత్రిగా పేరుగడించిన గుంటూరు జీజీహెచ్‌ను గత ప్రభుత్వాలు విస్మరించాయి. దాంతో గత ప్రభుత్వాల హయాంలో ఎలుకలు కరిచి పసికందు మరణించిన ఘటన, సెల్‌ఫోన్ వెలుతురులో ఆపరేషన్లు చేసిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. నేడు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ఎన్నడూలేని విధంగా రూ.కోట్ల విలువ చేసే వైద్య పరికరాలు ఆస్పత్రికి వచ్చాయి. కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా నేడు జీజీహెచ్ వైద్యులు ఆపరేషన్లు చేస్తున్నారు.

రూ.60 కోట్ల పరికరాలు...

గుంటూరు జీజీహెచ్ 1954లో ప్రారంభమైంది. ఏడు జిల్లాలకు చెందిన రోగులు చికిత్స కోసం వస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక గుంటూరు జీజీహెచ్‌లో కని, విని, ఎరుగని రీతిలో రూ. 60 కోట్ల విలువ చేసే 500 రకాల వైద్య పరికరాలు నాలుగేళ్ల కాలంలో జీజీహెచ్‌కు వచ్చాయి. ముఖ్యంగా కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం జీజీహెచ్‌కు రోగుల ప్రాణాలు కాపాడే వెంటిలేటర్లు వందల సంఖ్యలో వచ్చాయి.

అన్ని వైద్య విభాగాలకు...

జీజీహెచ్‌లో ప్రతి వైద్య విభాగానికి అత్యాధునిక వైద్య పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసింది. అంతర్జాతీయ చికిత్స ప్రమాణాలు పాటించేలా జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు రూ.18 కోట్లు ఖరీదు చేసే లీనియర్ యాక్సిలేటర్ పరికరాన్ని, రూ. 4 కోట్లు ఖరీదు చేసే బ్రాకీ థెరపీ వైద్య పరికరాన్ని ప్రభుత్వం అందించింది. ఈ వైద్య పరికరాల ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులకంటే దీటుగా జీజీహెచ్‌లోని క్యాన్సర్ సెంటర్‌లో అత్యాధునిక వైద్య సౌకర్యాలతో ముందస్తుగానే క్యాన్సర్ నిర్ధారణ చేయడంతోపాటు, స్పెషాలిటీ చికిత్సలు అందిస్తున్నారు. యూరాలజీ వైద్య విభాగంలో రూ. 2 కోట్ల ఖరీదు చేసే ఈఎస్‌డబ్ల్యూఎల్ వైద్య పరికరాన్ని ప్రభుత్వం అందజేసింది. ఈపరికరం ద్వారా కిడ్నీలో రాళ్లను ఆపరేషన్ లేకుండా గన్ ద్వారా పేల్చి బయటకు పౌడర్ రూపంలో తీస్తున్నారు. ప్రభుత్వం అందించిన వైద్య పరికరాలతో ఈఎన్‌టీ వైద్య విభాగంలో పుట్టుకతో వినికిడి సమస్యలకు రూ.18లక్షలు ఖరీదు చేసే కాక్లియర్ ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. జీజీహెచ్‌లో 1500 పడకలకు రూ. 3 కోట్లతో ఆక్సిజన్ సౌకర్యం కల్పించారు. రూ.కోటి ఖరీదుచేసే ఆక్సిజన్ ప్లాంట్లను నాలుగు నిర్మించారు. ఇలా రూ.లక్షలు ఖరీదు చేసే విలువైన పరికరాలను నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం జీజీహెచ్‌కు అందజేసింది.

భవన నిర్మాణాలకు నిధులు...

గత ప్రభుత్వాల కాలంలో నిర్లక్ష్యానికి గురై కేవలం శిలాఫలకాలకే అంకితమైన మాతా శిశు సంరక్షణ (ఎంసీహెచ్) వార్డు నిర్మాణ పనులు ఈ ప్రభుత్వ కాలంలో ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం రూ. 80 కోట్లతో ఎంసీహెచ్ వార్డు నిర్మాణం చేసేందుకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేసింది. నాడు- నేడు కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రికి, వైద్య కళాశాలకు రూ.500 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయడంతో పాటు, పలు నూతన భవనాల నిర్మాణాలకు సైతం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పారామెడికల్, నాల్గోతరగతి ఉద్యోగాలు 123, స్టాఫ్‌నర్సుల పోస్టులు 250 మంజూరు చేసి భర్తీచేసింది.

జీజీహెచ్‌కు స్వర్ణయుగం



గత ప్రభుత్వాలు చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జీజీహెచ్‌కు కోట్లాది రూపాయలు ఖరీదు చేసే వైద్య పరికరాలు మంజూరు చేసింది. జీజీహెచ్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా కాలం స్వర్ణయుగంగా పేర్కొనవచ్చు. వైద్య పరికరాలు అందించి వైద్య సిబ్బంది, వైద్యుల పోస్టులు భర్తీ చేయడం కాకుండా నూతనంగా పోస్టులు సైతం ముఖ్యమంత్రి మంజూరు చేశారు.

– డాక్టర్ నీలం ప్రభావతి, జీజీహెచ్ సూపరింటెండెంట్

సుబ్బారాయుడి సన్నిధిలో నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి విజయవాడ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ సూరికూచి కుమార్ రూ. 2,11,116లను విరాళంగా అందజేశారు. ఆదివారం సాయంత్రం ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఈ విరాళాన్ని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావుకు అందజేశారు. ఆయన వెంట డెప్యూటీ తహసీల్దార్ శివరామప్రసాద్, వీఆర్వో వెంకటరమణ ఉన్నారు.

భక్తుల రద్దీ..

దేవస్థానంకు ఆదివారం రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నిత్యాన్నదానానికి విరాళం అందిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

శ్రీ భ్రమర రామచంద్ర టౌన్‌షిప్ బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరించిన నాయకులు, తదితరులు

పాత గుంటూరు: రియల్ ఎస్టేట్, గృహ నిర్మాణ రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్న శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ శ్రీ భ్రమర రామచంద్ర టౌన్‌షిప్ పేరుతో మంగళగిరి సమీపంలోని కాజ గ్రామంలో అద్భుతమైన వెంచర్‌కు శ్రీకారం చుట్టింది. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య పాల్గొని బ్రోచర్ ఆవిష్కరించారు. భ్రమర టౌన్‌షిప్ చైర్మన్ గల్లా రామచంద్ర రావు, సంస్థ డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎం.ఎస్. రాజు, కోట శైలారెడ్డి, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, పరిటాల నరేష్, చెన్నంశెట్టి సతీష్ బాబు, కల్వకోట సాయి శంకర్, చల్ల రమేష్, వైఎస్సార్ సీపీ అద్దంకి ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ విజయవాడ, గుంటూరు నగరాల మధ్య భ్రమర రామచంద్ర టౌన్‌షిప్ నేషనల్ హైవే–16కు కేవలం 1 కి.మీ దూరంలో ఉందని తెలిపారు. 145 ఓపెన్ ప్లాట్లతో, 10 ఎకరాల్లో అత్యంత నాణ్యతతో వినూత్నంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినియోగదారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సీసీఎల్ విజేత గుంటూరు ఎస్పీ జట్టు


విజయకేతనం చూపుతున్న గుంటూరు ఎస్పీ క్రికెట్ జట్టు

నగరంపాలెం: స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో శ్రీ షిర్డీ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్పొరేట్ క్రికెట్ లీగ్ (సీసీఎల్)- 2023 ఆదివారం ముగిసింది. గుంటూరు ఎస్పీ క్రికెట్ (ఎస్పీ 11 టీం)/ ఐటీసీ క్రికెట్ టీం మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఇరు జట్ల మధ్య పోరు ఆసక్తికరంగా కొనసాగింది. చివరికి గుంటూరు ఎస్పీ క్రికెట్ జట్టు గెలిచి, విజయకేతనం ఎగురవేసింది. ఈ మేరకు క్రికెట్ జట్టును జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదివారం ఒక ప్రకటనలో అభినందించారు.

ఆనందాలను చిదిమేసిన మృత్యుదారి

కొడుకు పుట్టాడని వచ్చిన కాల్‌తో ఉబ్బితబ్బిబయ్యాడు.. ఆ శుభవార్త అతన్ని క్షణం కూడా ఉన్నచోట నిలపలేకపోయింది. ఆలస్యం చేయకుండా వెంటనే బైక్‌పై బయల్దేరి ఆస్పత్రికి చేరుకుని కొడుకును చూసుకుని మురిసిపోయాడు.. బంధువులందరూ శుభాకాంక్షలు చెబుతుండగా సంతోషంతో పరవశించాడు. ఊర్లో పనులు చూసుకుని, మళ్లీ వచ్చేస్తానంటూ భార్యకు జాగ్రత్తలు చెప్పి, ఇంటిబాట పట్టిన అతనికి రహదారే మృత్యుదారైంది. పొత్తిళ్లలో శిశువుతో ఉన్న భార్యకు తీరని వేదన.. కుమారుడిపై గంపెడాశలు పెట్టుకుని జీవిస్తున్న తల్లిదండ్రులకు రోదన మిగిల్చి, ఫాదర్స్‌డే రోజున తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు ఆ తండ్రి..

- జీజీహెచ్‌లో ప్రసవించిన భార్య, బిడ్డలను చూసేందుకు వచ్చి తిరిగి వెళుతూ వ్యక్తి మృత్యువాత
- డివైడర్‌ను ఢీకొని మృతి
- చూపరులను కంటతడి పెట్టించిన ఘటన


ప్రమాదంలో మృతి చెందిన అనిల్‌కుమార్

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుఝామున చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం అచ్చంపేట మండలం గ్రంధసిరి గ్రామానికి చెందిన కుంబ అనిల్‌కుమార్ (27) నరసరావుపేటలో ఎస్ఆర్‌కేటీ ట్రావెల్స్‌లో ఆయిల్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి తన భార్య గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో బిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న అనిల్ తన భార్యాబిడ్డలను చూసేందుకు శనివారం రాత్రి గుంటూరుకు తన ద్విచక్రవాహనంపై వచ్చాడు. అనంతరం ఆదివారం తెల్లవారుఝామున నరసరావుపేటకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. నల్లపాడు శివారు పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో ప్రమాదవశాత్తూ డివైడర్‌కు ఢీకొని తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి అతనిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుని బంధువులకు సమాచారం అందించిన పోలీసులు మృతదేహానికి పోస్ట్ మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వినూత్న విజయం.. ఊరంతా సంబరం

- ఐఏఎస్ సాధించిన బి.వినూత్న
- పులకించిన గోరంట్ల
- తమ ఆడబిడ్డకు అపూర్వ స్వాగతం
- ఉత్సాహంగా విజయోత్సవ ర్యాలీ


విజయోత్సవ ర్యాలీలో అభివాదం చేస్తున్న ఐఏఎస్ సాధించిన వినూత్న

గుంటూరు రూరల్: గుంటూరులోని గోరంట్ల ప్రాంతం 'వినూత్న' సంబరాలతో ఆనందంలో మునిగిపోయింది. తమ గ్రామానికి చెందిన ఆడబిడ్డ ఐఏఎస్‌కు ఎంపికవడంతో వారి గుండె గడపలో సంతోషం ఉప్పొంగింది. గోరంట్లకు చెందిన బొల్లిపల్లి రవి, సుభాషిణిల కుమార్తె బొల్లిపల్లి వినూత్న ఐఏఎస్ సాధించింది. దీంతో ఊరు ఊరంతా సంబరాలు చేసుకుంది. వినూత్న తండ్రి రవి యానిమల్ హస్బెండరీ శాఖలో డీడీగా పని చేశారు. ఉద్యోగరీత్యా ప్రకాశం జిల్లాలో స్థిరపడినప్పటికీ ఆ కుటుంబ ప్రస్థానమంతా గుంటూరులోని గోరంట్ల ప్రాంతంలోనే సాగింది. ఈ నేపథ్యంలో గురువారం విజయోత్సవాలు నిర్వహించారు. తొలుత లాడ్జి సెంటర్ నుంచి గోరంట్ల వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సుమారు రెండు వందల మంది జైబీమ్ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. గోరంట్ల సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక బీవీఆర్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో వినూత్న మాట్లాడుతూ ప్రతి క్షణం లక్ష్యాన్ని గుండెలపై పెట్టుకుంటే అది గుండె చప్పుడవుతుందని చెప్పారు. ఆ లక్ష్య సాధనను నిత్యం గుర్తు చేస్తుందన్నారు. తన విజయానికి తల్లిదండ్రులు ప్రేరణగా నిలిచారని తెలిపారు. ఫాదర్స్ డే రోజున తన కుటుంబ సభ్యుల మధ్య ఇలాంటి మధుర క్షణాలను గడపడం జీవితంలో మరువలేనని ఆమె భావోద్వేగానికి గురయ్యారు. బాబాసాహెబ్, భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ అక్షరంతో ప్రపంచానికి మార్గదర్శకుడయ్యాడని, ఆయనే తనకు ఆదర్శం అని చెప్పారు. వినూత్న బాబాయి తహసీల్దార్ బొల్లిపల్లి వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కన్నా జీవితమంతా అవినీతిమయమే

- అవినీతి గురించి ఆయన మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగానే ఉంది
- 45 గజాల స్థలం నుంచి నేడు రూ.వేల కోట్ల ఆస్తి ఎలా సంపాదించారు?
- రూ.500 కోట్లు అవినీతి నిరూపించలేక పోతే రాజకీయ సన్యాసం తీసుకుంటావా?
- మాజీ మంత్రి కన్నాకు జీడీసీసీ బ్యాంకు చైర్మన్ లాలుపురం రాము సవాల్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు

కొరిటెపాడు(గుంటూరు): మాజీ మంత్రి, టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణ అబద్ధాలు మాట్లాడితే.. తాను నిజాలు చెబుతానని, ఆయన జీవితమంతా అవినీతి మయమేనని గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) పేర్కొన్నారు. బ్రాడీపేటలోని జీడీసీసీ బ్యాంక్ సమావేశ మందిరంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మొదట్లో సున్నాగా ఉన్న కన్నా.. 45 గజాల స్థలం నుంచి వేల కోట్ల రూపాయలకు ఎగబాకింది కుంభకోణాలు, అవినీతితోనే అన్న సంగతి ఉమ్మడి గుంటూరు జిల్లాలో అందరికీ తెలుసు అని అన్నారు. కన్నా స్కాముల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. సహకారశాఖ మంత్రిగా తన తండ్రి దినానికి విజయవాడలోని విజయ కృష్ణ కో-ఆపరేటివ్ సూపర్ బజారు నుంచి లారీల కొద్దీ సరుకులు తెప్పించుకున్న నీచమైన చరిత్ర కన్నాదని.. అందుకు తానే ప్రత్యక్ష సాక్షినన్నారు. కన్నా పాపాల చిట్టా అంతా తనకు తెలుసని.. దాని గురించి మాట్లాడుకుందామా..? నువ్వేంటో.. నీ బతుకేంటో.. గుంటూరు ప్రజలందరికీ తెలుసు అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అలాంటి కన్నా లక్ష్మీనారాయణ అవినీతి గురించి మాట్లాడటం హాస్యాస్పదమని రాము ఎద్దేవా చేశారు.

చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ చదవడం సిగ్గుచేటు

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో రూ.500 కోట్ల మేర అవినీతి జరిగిందని ఆరోపిస్తూ మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ సీబీఐకి లేఖ రాయడంపై ఆ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము భగ్గుమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టు పట్టుకుని మీడియా ముందు కనీస పరిజ్ఞానం లేకుండా కన్నా ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు తెలుగుదేశాన్ని, చంద్రబాబును ఎన్ని తిట్లు తిట్టాడో ఉమ్మడి రాష్ట్ర ప్రజలందరికీ ఇంకా గుర్తుందన్నారు. అలాంటిది ఇప్పుడు కేవలం తన రాజకీయ స్వలాభం కోసం టీడీపీలో చేరిన కన్నాకు, ఆయన్ను చేర్చుకున్న చంద్రబాబుకు సిగ్గులేదన్నారు.

నిరూపించకలేకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటావా..?

తమ బ్యాంక్ పరిధిలో నకిలీ పాసు పుస్తకాలతో రూ.13 కోట్ల సొమ్ము స్వాహా జరిగిన మాట నిజమేనని.. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే కాక తమ హయాంలో జరిగిన వాటిపైనా విచారణకు సిద్ధమని స్పష్టం చేశారు. తమ బ్యాంకులో జరిగిన అవినీతి గుట్టును తామే స్వయంగా వెలికి తీసి అందుకు బాధ్యులైన వారిపై నిజాయితీగా చర్యలు చేపట్టిన ప్రభుత్వం మాది అని ఆయన సగర్వంగా ప్రకటించారు. అందరికీ తెలిసిన ఈ వాస్తవాలు తాజాగా చంద్రబాబు చంకలో దూరిన కన్నాకు తెలియకపోవడం శోచనీయమన్నారు. అవినీతి అంతమే పంతంగా అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేసే నిబద్ధత కలిగినవారిగా, కన్నా డిమాండ్ చేసిన సీబీఐ విచారణకు స్వాగతిస్తున్నట్లు వెల్లడించారు. తాము కూడా కన్నా అవినీతి, అక్రమ సంపాదనపై సీబీఐ విచారణ కోరతామని తెలిపారు. కన్నాకు దమ్ము, ధైర్యం ఉంటే ఆయన కూడా దాన్ని స్వాగతించాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో రూ.500 కోట్ల మేర అవినీతి జరిగిందని కన్నా లక్ష్మీనారాయణ నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఆయన ప్రకటించారు. ఒక వేళ నిరూపించలేకపోతే రాజకీయ సన్యాసం స్వీకరించాలని కన్నాకు బహిరంగ సవాల్ విసిరారు. ఈ విషయంపై బహిరంగంగా చర్చకు సైతం తాను సిద్ధమని.. కన్నాపై పరువు నష్టం దావా కూడా వేస్తామని ఆయన తేల్చి చెప్పారు. నిజంగా తాను చేసిన ఆరోపణలకు కన్నా కట్టుబడి ఉంటే కనీసం బహిరంగ చర్చకు సిద్ధం కావాలని.. లేదంటే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మరోమారు తమ బ్యాంకు గురించి కానీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం గురించి కానీ అవాకులు, చెవాకులు పేలితే తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

భాష్యం జైత్రయాత్ర

నగరంలో ద్విచక్ర వాహనాలు, బస్సులతో భారీ ర్యాలీ



గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 ఫలితాల్లో భాష్యం ఐఐటీ-జేఈఈ అకాడమీ విద్యార్థులు అఖిల భారతస్థాయి ఓపెన్ కేటగిరీలో అత్యుత్తమ ర్యాంకులను సాధించిన సందర్భంగా ఆదివారం భాష్యం విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వందలాది ద్విచక్ర వాహనాలు, పాఠశాల బస్సులతో జైత్రయాత్ర పేరుతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 5వ, 10వ ర్యాంకులు సాధించిన ఏవీ శివరామ్, వైవీ మణీందర్ రెడ్డితో పాటు ఇతర ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రత్యేక వాహనంలో ఎక్కించి నగరంలోని ప్రధాన రోడ్లపై ఊరేగించారు.

కల్యాణ పుష్కరిణికి పూర్వ వైభవం

- నిపుణుల కమిటీ సభ్యుల నియామకం
- పానకాలస్వామి కొండపైకి రోప్‌వే మార్గం
- కనకదుర్గ సన్నిధి నుంచి నృసింహుని గుడికి బస్ సర్వీసులు
- దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ


మాట్లాడుతున్న ఎస్.సత్యనారాయణ, పక్కన ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: మంగళగిరి లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన పెద్ద కోనేరు(కల్యాణ పుష్కరిణి)కి పూర్వ వైభవం తీసుకువస్తామని, నిపుణుల కమిటీని నియమించి వారి సలహాలు, సూచనలతో కోనేరు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డితో కలసి లక్ష్మీ నృసింహస్వామి వారిని, రాజ్యలక్ష్మి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పెద్ద కోనేరు అభివృద్ధి పనులను పరిశీలించారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ 108 దివ్య క్షేత్రాల్లో అతి ముఖ్యమైన దివ్యక్షేత్రం మంగళగిరి లక్ష్మీ నృసింహస్వామి దివ్యక్షేత్రమన్నారు. దేవస్థానానికి చెందిన పెద్ద కోనేరు ఒక చారిత్రాత్మకమైనదని, అటువంటి కోనేరు అభివృద్ధిపై సమీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. పెదకోనేరును రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగా దేవదాయ ధర్మాదాయ శాఖ రూ.కోటి కేటాయించగా దేవస్థానం రూ.50లక్షల నిధులను కేటాయించిందన్నారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో కోనేరు అభివృద్ధి పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెదకోనేరు మెట్లు ఎంతో పాతవని, గత కొన్నేళ్ల క్రితం పిడుగుపాటుకు కొన్నిమెట్లు మరమ్మతులకు గురైనట్లు తెలిపారు. కోనేరు అభివృద్ధి కోసం నిపుణుల కమిటీని నియమించి వారి సలహాలు, సూచనలతో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కోనేరు అభివృద్ధికి సంబంధించి అంచనాలు మించిన నేపథ్యంలో రివైజ్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. దేవస్థానం చారిత్రాత్మక, ఆధ్యాత్మిక నేపథ్యం దృష్ట్యా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని, అందులో భాగంగా వాహనాల పార్కింగ్‌కు దేవదాయ శాఖకు చెందిన భూమిని కేటాయిస్తామన్నారు. కొండపై వేంచేసియున్న పానకాల లక్ష్మీ నృసింహస్వామి వారి సన్నిధికి రోప్‌వే ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న కాలంలో తిరుపతి తరహాలో కోనేరులో స్వామివారి చక్ర స్నానాలతో పాటు అన్ని రకాల ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. విజయవాడ కనకదుర్గ గుడి నుంచి మంగళగిరి నృసింహుని ఆలయానికి ఆర్టీసీ బస్ సర్వీసులను ఏర్పాటు చేస్తామని, అవసరమైతే దేవదాయ శాఖ ఆధ్వర్యంలోనే బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. దేవదాయశాఖలో తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ దేవాలయాలకు ఉన్న 3.80 లక్షల ఎకరాల భూముల్లో దాదాపు 15–20వేల ఎకరాల భూములు కోర్టుల పరిధిలో ఉన్నాయని, కోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. దేవదాయ ఆస్తుల పరిరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. కామన్ గుడ్ ఫండ్ కింద రాష్ట్ర వ్యాప్తంగా 618 దేవాలయాలను అభివృద్ధి చేశామని, దేవాలయాల అభివృద్ధి నిరంతర ప్రక్రియ అన్నారు.


ఇద్దరు ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐలు క్రాంతి కిరణ్, జగన్‌మోహనరావు

మంగళగిరి: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. సుమారు రూ.4.50 లక్షలు విలువ చేసే 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్ వివరాలు వెల్లడించారు. నవులూరుకు చెందిన ముప్పా వెంకటేశ్వరరావు ఈనెల 14వ తేదీన తన ద్విచక్ర వాహనాన్ని చినకాకాని ఎన్నారై వైద్యశాల పార్కింగ్‌లో ఉంచి లోపలకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుని పారిపోయారు. దీంతో బాధితుడు అదే రోజు మంగళగిరి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఆదివారం యర్రబాలెం డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల వద్ద ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన ఒంటిపులి ధర్మయ్య అలియాస్ సిద్ధూ, పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన వేముల శ్రీనివాసరావులను పట్టుకుని, ముప్పా వెంకటేశ్వరరావుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను క్షుణ్ణంగా విచారించడంతో వారు పాత నేరస్తులని, మొత్తం 10 ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు తేలింది. చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను విజయవాడ ఆటోనగర్, చినకాకాని హాయ్‌ల్యాండ్ పొదల వద్ద దాచినట్లు తెలిపారు. దీంతో పోలీస్ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో నిందితులు దాచిన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ జె.రాంబాబు పర్యవేక్షణలో కేసు ఛేదించిన ఎస్ఐలు క్రాంతి కిరణ్, జగన్‌హనరావులతో పాటు క్రైమ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ అభినందించారు.

ఆధ్యాత్మికతతోనే సంపూర్ణానందం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు
- అమ్మచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహా చండీహోమం


చండీహోమంలో పాల్గొన్న సోము వీర్రాజు

గుంటూరు వెస్ట్: యోగ భూమిగా, కర్మ భూమిగా ప్రపంచ దేశాల వారితో కొనియాడబడుతున్న మన దేశంలో ఆధ్యాత్మికతకు ఎంతో విశిష్టత ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు స్వామి జ్ఞానప్రసన్న గిరి సారధ్యంతో వేదపండితుల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చుట్టుగుంట వద్దనున్న షిర్డీసాయి దేవాలయంలో మహా చండీహోమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సోము వీర్రాజు మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే సంపూర్ణ సంతోషం, వికాసం కలుగుతాయన్నారు. ప్రతి ఒక్కరు ప్రతి రోజు కొంత సమయమైనా దైవారాధనలో గడపాలని కోరారు. శాసన సభ్యులు మద్దాళి గిరిధర్, వెలంపలి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ జిల్లా ప్రజలకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఎంతో సేవ చేస్తుందన్నారు. ప్రజలు సంతోషంగా జీవించాలనే గొప్ప సంకల్పంతో చేస్తున్న మహాచండీ యాగంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మాజీ కార్పొరేటర్ అడకా శ్రీనివాసరావుతోపాటు నిర్వాహకులు పాల్గొన్నారు.

మిర్చి ఎక్స్‌పోర్ట్ వ్యాపారుల నుంచి నగదు ఇప్పించాలని వినతి


సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషాకు వినతి పత్రాన్ని అందజేస్తున్న రైతులు

గుంటూరు రూరల్: మిర్చి ఎక్స్‌పోర్ట్ పేరుతో కోట్లాది రూపాయల మిర్చిని రైతులు, వ్యాపారుల వద్ద తీసుకుని వాటికి సంబంధించిన నగదును వారి ఖాతాల్లో జమచేసుకుని రైతులను, వ్యాపారులను మోసం చేసిన ఎక్స్‌పోర్ట్ వ్యాపారుల నుంచి నగదు ఇప్పించి తమకు న్యాయం చేయాలని సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషాను ఆదివారం బాధితులు కలిసి ఫిర్యాదు చేశారు. ఎక్స్‌పోర్ట్ వ్యాపారం పేరుతో తమను మోసం చేసిన వారినుంచి రావాల్సిన డబ్బులను ఇప్పించాలని కోరారు. ఇదే సంఘటనపై పోలీసులకు గతంలో తాము ఫిర్యాదు చేశామని నిందితులను అరెస్ట్ చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారన్నారు. అయితే తమకు రావాల్సిన నగదు వచ్చే విధంగా చూడాలని వేడుకున్నారు. చైనాతో ముడిపడి గుజరాత్, అహ్మదాబాద్, వరంగల్ వరకు ఉన్న ఈ చైన్ లింక్‌కు నల్లపాడు పోలీసులు గతంలో చెక్ పెట్టారన్నారు. చైనా, గుజరాత్, అహ్మదాబాద్, వరంగల్‌లో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. ఈ కేసులో కీలక పాత్ర పోషించిన నిందితుడు గుంటూరు జిల్లా జైలులో ఉండగా అతన్ని పోలీసు కస్టడీ కోసం న్యాయస్థానంలో పిటిషన్ వేశారన్నారు. దానికి న్యాయస్థానం ఆమోదించిందని, అయితే కొందరు పోలీస్ ఉన్నతాధికారులపై ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో ఇంటర్నేషనల్ క్రిమినల్స్ ఉన్నారని కోట్లాది రూపాయల మోసం జరిగిందని న్యాయం చేయాలని వేడుకున్నారు. రెండు సంవత్సరాలుగా న్యాయ పోరాటం చేస్తున్నామని, రైతుల కష్టాన్ని బాధ్యతగా తీసుకున్న వ్యాపారులు సైతం పోరాటం చేస్తున్నారన్నారు. తమ డబ్బులను ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి 'నేతన్న నేస్తం' నమోదు ప్రారంభం

కొరిటెపాడు(గుంటూరు): 2023–24 సంవత్సరంలో వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద లబ్ధి పొందిన చేనేత కార్మికుల వివరాలు ధ్రువీకరణ, కొత్త లబ్ధిదారుల నమోదు ప్రక్రియ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమై జూలై 9వ తేదీన ముగుస్తుందని గుంటూరు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు వి.వనజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి వారి పరికరాలను ఆధునికీకరించడానికి, విద్యుత్ మగ్గాలతో తయారైన ఉత్పత్తులతో పోటీపడి వస్త్రాలను ఉత్పత్తి చేయడానికి ఏడాదికి ఒక్కో చేనేత కుటుంబానికి రూ.24 వేలు అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సొంత చేనేత మగ్గం కలిగి ఉండి, చేనేత వృత్తిపై ఆధారపడ్డ చేనేత కార్మికులకు, దానిపై జీవనోపాధి పొందుతూ, చేనేత శాఖ డేటా బేస్‌లో ఉన్నవారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. ఒక చేనేత కుటుంబంలో ఎన్ని మగ్గాలు కలిగి ఉన్నా ఒకరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. దారిద్ర్య రేఖకు దిగువున ఉండి, చేనేత కార్మికులు నూతనంగా మగ్గం ఏర్పాటు చేసుకుంటే, అప్పటి నుంచి సంవత్సర కాలం పాటు పూర్తిగా మగ్గంపై పని చేసిన వారు మాత్రమే ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు అర్హులని తెలిపారు. ప్రాథమిక చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్ల షెడ్లలో పనిచేసే చేనేత కార్మికులు, చేనేత అనుబంధ వృత్తులలో పనిచేసే కార్మికులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందడానికి అనర్హులని స్పష్టం చేశారు. జూలైలో వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు వెల్లడించారు. గుంటూరు జిల్లాలో మంగళగిరి, తెనాలి, తాడికొండ, పొన్నూరు నియోజకవర్గ ప్రాంతాల్లో అత్యధికంగా చేనేత కార్మికులు ఉన్నారని తెలిపారు. అర్హులైన ప్రతి చేనేత కార్మికుడు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సంబంధిత సచివాలయ సిబ్బందిని, గుంటూరులోని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు కార్యాలయం 0863-2224833, 8008705713 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆమె తెలియజేశారు.

24, 25 తేదీల్లో ఓపెన్ టెన్నిస్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఎక్స్‌ట్రీమ్ టెన్నిస్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో అండర్ - 12 బాల బాలికల (సింగిల్స్, డబుల్స్) రాష్ట్రస్థాయి ఓపెన్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తామని పోటీల నిర్వాహకుడు జి.కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను గోరంట్ల వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని తమ టెన్నిస్ సెంటర్లో ఏర్పాటు చేశామని చెప్పారు. 23వ తేదీలోపు జట్లు తమ ఎంట్రీలను పంపించాలన్నారు. వివరాలకు 7842629471 నెంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.

మంచి మాట



సాధించాల్సిన లక్షణం ఐకమత్యం

ఐకమత్యంతో ఉండడం, మానవులు కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవడం, మనుషుల్లో సమానత్వం అనేవి ప్రస్తుత పరిస్థితిలో మన సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం. నిజానికి ఇవి ప్రస్తుతానికి మాత్రమే కాదు, ఎప్పటికీ తప్పకుండా అవసరం అయినవే. వర్తమానంలోలాగానే గతంలోనూ ఇవి నిజాయితీగానూ, నిజంగానూ మనలో చోటుచేసుకోలేదు. అందుకే మన వర్తమానం ఉండాల్సినంత ఫలవంతంగానూ, విజయవంతంగానూ లేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని తెలుసుకుని మనం వీటిని ఆవాహన చేసుకోవాలి.

వేద వాఙ్మయంలోని సూక్తాల్లో సంవనన సూక్తం ఒకటి. ఇది ఋగ్వేదానికి చెందినదిగా చెప్పబడింది. కలిసికట్టుగా ఉండడం, కార్యోన్ముఖత్వం, సమానత్వం వీటిని ఉద్దేశిస్తూ, ఉవాచిస్తూ, ఉద్బోధిస్తూ సనాతన సాహిత్యం ఈ సంవనన సూక్తం ద్వారా విశ్వమానవాళికి యుక్తమైన చింతనను అందజేస్తోంది. ఇకనైనా మనం ముందుకు వచ్చి దాన్ని అనుసరించాల్సి ఉంది.

'సంసమిద్యువసే వృషన్నగ్నే విశ్వాన్యర్య ఆ' అంటూ మంచిని కురిపించే దైవమైన అగ్నీ! విశ్వమంతా ఇక ఐకమత్యంతో ఉండేట్టు చెయ్యి అని ఐకమత్యం ఆవశ్యకతను గుర్తెరిగి సంవనన సూక్తం ప్రార్థన చేసింది. ఈ విశ్వంలోని మానవులకు లుప్తం కాకుండా కావాల్సింది ఏమిటి? అది ఐకమత్యం కాకపోతే ఇంకేమిటి?? మనం ఆ ఐకమత్యాన్ని ఆకాంక్షించి సాధించాలి.

ఐకమత్యం తరువాత విశ్వమానవుల్ని కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవండి, కలిసికట్టుగా మాట్లాడండి, మీ మనసుల్లో కలిసిపోయిన ఒకే అవగాహన నెలకొనాలి; మొదట్లో దేవతోపాసనలో ఏవిధంగా భాగమయ్యారో అలా కలిసికట్టుగా ఉండండి అని సూచిస్తూ 'సం గచ్ఛధ్వం సం వదధ్వం సం వో మానాంసి జానతామ్ దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే' అని తెలియజెప్పింది సంవనన సూక్తం.

> ఆలోచనలు ఒకటైతే బలం అన్న సార్వజనీనమైన, సార్వకాలికమైన, సకల శ్రేయస్కరమైన చింతనను మనం మస్తిష్కాల్లో సమ్మిళితం చేసుకోవాలి; మన అస్తిత్వానికి ప్రశాంతతను సమకూర్చుకుని సుఖంగానూ, సంతోషంగానూ జీవించాలి.

ఐకమత్యం, కలిసికట్టుగా పనిచెయ్యడం తరువాత మానవుల్లో ఉండాల్సింది సమానత్వం. అందుకే 'సమానో మన్త్రః సమితిః సమానీ సమానం మనః సహ చిత్తమేషామ్ సమానం మన్త్రమభి మన్త్రయే వః సమానేన వో హవిషా జుహోమి' అంటూ మంత్రం అందరికీ సమానం, సభలు సమానత్వంతో ఉండాలి. మీ ఆలోచనలూ, చిత్తమూ సమానంగా ఉండాలి, మీ కోసం సమానంగా మంత్రాన్ని అభిమంత్రిస్తాం, మీ కోసం సమానంగా ఆహుతుల్తో ఆరాధిస్తాం అని సంవనన సూక్తం ద్రష్టలు గట్టిగా చాటారు.

అంటరానితనమో, భేద చింతనో వేదంలోనూ, సనాతన సాహిత్యంలోనూ లేదు అన్న సత్యాన్ని ఈ మాటల ద్వారా సరిగ్గా అర్థం చేసుకున్నాక, చక్కగా ఆకళింపు చేసుకున్నాక 'సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి' అంటూ మీ తలపులు లేదా సంకల్పాలు ఒకటే అయి ఉండాలి, మీ హృదయాల భావాలు ఒకటే అయి ఉండాలి, మీ ఆలోచనలు ఒక్కటై ఉండనీ. ఇలా మీలో మంచితనం బలం నెలకొనాలి అని సంవనన సూక్తం చేసిన దిశానిర్దేశాన్ని మనం అవగతం చేసుకోవాలి; అటుపై ఆచరణలోకి ఆహ్వానించి దాన్ని అమలులో నిలపాలి.

ఒక కుటుంబంలోని, ఒక సమాజంలోని, ఒక దేశంలోని, ఒక ప్రపంచంలోని మనుషుల్లో ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం ఈ మూడూ లేకపోవడంవల్ల జరుగుతున్న హానికి ప్రతి మనిషీ గురి అవుతున్నాడు; కలుగుతున్న నష్టానికి ప్రతి మనిషీ బలి అవుతున్నాడు. ఎప్పుడో కాదు ఇప్పటికి ఇప్పుడు ముమ్మాటికి ఆ మూడిటిని మనకు మనం అన్వయించుకోవాలి; ఉన్న, రానున్న ముప్పుల్ని లేకుండా చేసుకోవాలి. మునుపటి ప్రమాదాలకు ముగింపు పలికి ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం వీటితో ప్రమోదంగా మనం మునుముందుకు సాగుతూ ఉండాలి.

– రోచిష్మాన్

సన్నిధి

గురువాణి

నీ ఆకలి, నీ నిద్ర నీదే కదా... మరి..!!!

నీవు ఎదగలేకుండా పోవడానికి కారణం ఎవరు ? నీకు సలహాలిచ్చేవారికోసం, నీకు సహాయపడేవారి కోసం చూస్తున్నావా? నీకు బంధువులు లేరా? వాళ్ళు నిన్ను పట్టించుకోవడంలేదా? నీకు స్నేహితులు, శ్రేయోభిలాషులెవరూ లేరా? వారు నీకు మార్గదర్శనం చేయడం లేదా? లేక... నీకు శత్రువులు ఎక్కువగా ఉన్నారా? వాళ్లు నిన్ను ముందుకు పోనీయడం లేదా? అంటే ఎవరో రావాలనీ, వాళ్ళు నిన్ను జాగ్రత్తగా నడిపించాలనీ, నీ ప్రతి కష్టంలో వారు నీకు తోడుగా నిలబడి దిశానిర్దేశం చేయాలని నీవు కోరుకుంటున్నావని అర్థం... దీనికి జగద్గురువయిన కృష్ణ పరమాత్మ ఏమంటున్నాడో చూడండి...

''ఉద్ధరేద్ ఆత్మనాత్మానమ్ నాత్మానమ్ అవసాదయేత్, ఆత్మైవ హై ఆత్మనో బంధుర్ ఆత్మైవ రిపుర్ ఆత్మనః''

– అంటే నీకు నీవే బంధువువు, నీకు నీవే స్నేహితుడివి, నీకు నీవే శత్రువివి. నీకు ఆకలివేస్తే నీవే తినాలి, నీకు నిద్రవస్తే నీవే నిద్ర పోవాలి, నీకు దాహం వేస్తే నీవే నీళ్ల తాగాలి...అలాగే నీకు కష్టం వచ్చినప్పుడు, నీకు సమస్యలు ఎదురయినప్పుడు ఎవరో వస్తారని, నిన్ను కటాక్షిస్తారని, నిన్ను ఉద్ధరిస్తారని ఎదురు చూస్తూ కూచోవద్దు. బంధువులు, స్నేహితులు, శత్రువులు బయట లేరు... నీలోనే ఉన్నారు. నీవు వారిని గుర్తిస్తే... నీకు ఇక ఏ చింతా ఉండదు. నీ నిద్ర నీవు పోయినట్లుగానే, నీ ఆకలి నీవు తీర్చుకున్నట్లుగానే... నీ కష్టాన్ని కూడా నీవే తీర్చుకుంటావు.

భగవంతుడు మనకు కొన్ని అద్భుతమయినవి ఇచ్చాడు. భువనం.. ఈ ప్రపంచాన్ని ఇచ్చాడు. నీ జీవితం వర్ధిల్లడానికి ప్రకృతిని ఇచ్చాడు. నీకు ఆహ్లాదమయినవి చూసి సంతోషించడానికి కళ్ళు ఇచ్చాడు.. నీకు ఇష్టమయినవి వినడానికి చెవులిచ్చాడు. తాకి అనుభూతి చెందడానికి చర్మానికి స్పర్శనిచ్చాడు. వాసనలు చూడడానికి ముక్కు ఇచ్చాడు... ఇలా చాలా ఇచ్చాడు... ఇవన్నీ నీకోసం, నీవు అనుభవించడానికే ఇచ్చాడు... అయితే ఇవన్నీ ధర్మచట్రంలో ఇమిడేటట్టు చూసుకోమన్నాడు... అంతే.. అదే చేసెయ్... ఇవన్నీ వదిలేసి మనసు పక్క చూపులు చూస్తున్నదనీ, ఎటో లాగుతున్నదనీ విచ్చలవిడిగా పోతే ... నీలో ఉన్న శత్రువును... నీవే ఉత్సాహపరిస్తే... నీ పతనానికి నీవే దారి ఏర్పాటు చేసుకుంటున్నట్లు అవుతుంది.



పిల్లలను కూర్చోబెట్టుకుని వారికి మంచీ చెడూ ఎలా చెబుతుంటావో... నీ మనసుకు కూడా ప్రతిరోజూ, ప్రతి క్షణం అలా చెబుతూ ఉండు... అప్పుడది నీకు ఆత్మ బంధువుగా మారుతుంది. నీ శ్రేయస్సు కోరే నీ స్నేహితుడిగా, నీ శ్రేయోభిలాషిగా నీకు మార్గదర్శనం చేస్తుంది. నీ కంటికి కనురెప్ప ఉంది. అది నీ కంటిని ఎలా కాపాడుతుంటుందో నీ మనసును అనుక్షణం నీవు అలా కాపాడుతుండాలి. అదే నిన్ను నీవు ఉద్ధరించుకోవడం– అని పరమాత్మ గీతాబోధ చేసాడు. ఇంత కన్నా చెప్పడానికి ఎవరికయినా ఏముంటుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

భాషా మాధుర్యం



ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. ఢిల్లీలో స్థిరపడాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం దేనికని ఇంటి గేటుకు 'తెలుగు నేర్పించబడును' అని బోర్డు పెట్టించాడు.

'ఇక్కడెవరు తెలుగు నేర్చుకుంటారు? మీకు పిచ్చి కాకపోతేను...' అని కుటుంబ సభ్యులు ఆట పట్టించినా పట్టించుకోలేదు. ఆరు నెలలు గడిచినా ఎవ్వరూ రాలేదు. అయినా ఆయన నిరాశ చెందలేదు. ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు వస్తారని, తెలుగు నేర్చుకుంటారని ఆశగా ఉండేవాడు.

ఆయన అనుకున్నట్టుగానే ఒక రోజు సాయంత్రం పడవలాంటి కారు ఇంటి ముందర వచ్చి నిలుచుంది. అందులో నుంచి, మంచి పేరున్న ఓ వృద్ధ హిందీ రచయిత దిగాడు. తెలుగు నేర్పమని కోరాడు. అందుకు సంతోషంగా సమ్మతిస్తూ ఎప్పుడెప్పుడు రావాలో, ఏయే పుస్తకాలు తెచ్చుకోవాలో...' లాంటివి చెప్పాడు తెలుగు పండితుడు.

అలాగేనని చెప్పి బయలుదేరుతున్న రచయితతో ''ఈ వయసులో మీకు తెలుగు నేర్చుకోవాలని ఎందుకు అనిపించింది?'' అని అడిగాడు.

''నేను ఈ మధ్యనే దక్షిణాది తీర్థయాత్రకు వెళ్ళాను. యాత్రలో భాగంగా తిరుమలకొండ కూడా వెళ్ళాను. అక్కడ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ రాసిన తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు విన్నాను. గుండె లోలోతు పొరల్ని తాకాయి ఆ కీర్తనలు. తెలుగు భాష నేర్చుకుంటే అన్నమయ్య రచనల్ని మరింత లోతుగా పరిశీలించవచ్చని భావించాను. అందుకే మీ దగ్గర తెలుగు నేర్చుకోవాలనుకున్నాను'' అని బదులిచ్చాడు.

రచయిత మాటలు విన్న విశ్రాంత ఉపాధ్యాయుడి కళ్ళు తడి అయ్యాయి.

'అయ్యో... తెలుగువాడినై ఉండి నేను ఇప్పటివరకు అన్నమాచార్య కీర్తనలను ఆస్వాదించలేకపోయానే...' అని బాధ పడ్డాడు.

ఒకపక్క ఆ రచయితకు తెలుగు పాఠాలు చెబుతూనే అన్నమయ్య గ్రంథాలను చదవడం, వినడం ప్రారంభించాడు. అన్నమయ్య కీర్తనల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా



● రవితేజ

గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా?

రవితేజ యమా స్పీడ్‌గా సినిమాలు చేస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'టైగర్ నాగేశ్వరరావు' అక్టోబరు 20న, 'ఈగిల్' జనవరిలో రిలీజ్ కానున్నాయి. అయితే ఈ చిత్రాల తర్వాత రవితేజ ఏ దర్శకుడితో సినిమా చేస్తారు? అనే చర్చ కొంతకాలంగా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. గోపీచంద్ మలినేని, అనుదీప్ వంటి దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా జీవీఆర్ వాసు చెప్పిన ఓ స్టోరీ లైన్‌కు రవితేజ ఇంప్రెస్ అయ్యారని, పూర్తి కథ విన్న తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై తుది నిర్ణయం తీసుకుంటారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనుందనే ప్రచారం కూడా జరుగుతోంది. మరి.. జీవీఆర్ వాసు కథకి రవితేజ ఫైనల్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేదా? వేచి చూడాలి.

వారికి కాజల్ ఓ ఉదాహరణ

– దర్శకుడు శేఖర్ కమ్ముల

''మగధీర' సినిమాలో మిత్రవిందగా కాజల్ ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా హీరోయిన్స్ వారి కెరీర్‌ను కొనసాగించవచ్చనడానికి కాజల్ ఓ ఉదాహరణగా నిలుస్తున్నారు. 'సత్యభామ' సినిమా గ్లింప్స్ బాగుంది.. టీమ్‌కు ఆల్ ది బెస్ట్'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. అఖిల్ డేగల దర్శకత్వంలో అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం, జూన్ 19) కాజల్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'సత్యభామ' సినిమా గ్లింప్స్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''తెలుగుచిత్ర పరిశ్రమ నాకు ఇల్లు లాంటింది. తెలుగు ఆడియన్స్ బెస్ట్. వారి ప్రేమ, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నా'' అన్నారు. ''నా తొలి సినిమాకు హీరోగా నిలిచిన కాజల్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు అఖిల్ డేగల. ''మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తాం'' అన్నారు శ్రీనివాస్, బాబీ. ఈ కార్యక్రమంలో స్క్రీన్‌ప్లే, చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క, కథారచయితలు రమేష్, ప్రశాంత్, కెమెరామేన్ మోహిత్ కృష్ణ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



● శశికిరణ్, అఖిల్, శేఖర్ కమ్ముల, కాజల్, శ్రీనివాస రావు, బాబీ

నాన్‌స్టాప్‌గా నలభై రోజులు!



● మహేశ్‌బాబు

'గుంటూరు కారం' సెట్స్‌లోకి మహేశ్‌బాబు మరోసారి అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పట్టేలా ఉంది. మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ జూలై మొదటి వారంలో ప్రారంభించాలని యూనిట్ భావిస్తోందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే జూలైలో ప్రారంభమయ్యే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ నాన్‌స్టాప్‌గా దాదాపు 40రోజులకుపైగా జరుగుతుందనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

హారర్ సినిమాలు చేయకూడదనుకున్నా

– నందితా శ్వేత



● అనూప్, నందితా శ్వేత, శంకర్, శంకర్ మార్తాండ్

''హారర్ చిత్రాల్లో నటించకూడదనుకున్నాను. కానీ 'ఓ మంచి ఘోస్ట్' సినిమా కథ నచ్చడంతో చేశాను. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని హీరోయిన్ నందితా శ్వేత అన్నారు. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, నవమి గాయక్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. అభినిక ఐనాభాతుని నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పాప నువ్వు తోపు..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. సింహాచలం లిరిక్స్ అందించిన ఈ పాటను బాలసూరన్న పాడారు. ఈ పాట విడుదల వేడుకలో శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ– ''హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. హారర్ కథలకు మ్యూజిక్ చాలా ముఖ్యం.. అనూప్‌గారు ప్రాణం పెట్టి ఈ సినిమాకు సంగీతం అందించారు'' అన్నారు. ''ఓ పాప నువ్వు తోపు..' పాట ఆకట్టుకుంటుంది'' అన్నారు అనూప్ రూబెన్స్.

మా నాన్న సూపర్ హీరో!



● సుధీర్‌బాబు

'మా నాన్న సూపర్ హీరో' అంటున్నారు సుధీర్ బాబు. 'లూజర్' వెబ్‌సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి 'మా నాన్న సూపర్ హీరో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మూవీలో ఆర్నా హీరోయిన్. సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం (జూన్ 18) ఫాదర్స్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. ''తండ్రీకొడుకుల ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలియజేసేలా 'మా నాన్న సూపర్ హీరో' ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో రాజు సుందరం ఓ కీలక పాత్రలో నటిస్తూనే, కొరియోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాయిచంద్, సాయాజీ షిండే, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: జై క్రిష్, కెమెరా: సమీర్ కల్యాణి.

ఇదేం జీవితం?



● రామకృష్ణ గౌడ్, సాయిప్రసన్న, శ్రీకాంత్

శ్రీకాంత్ గుర్రం, సాయిప్రసన్న జంటగా ఎస్ఎస్ శాస్త్రీ దర్శకత్వంలో 'ఇది ఏం జీవితం రా అయ్యా' సినిమా ప్రారంభమైంది. బొక్కిసం భూలక్ష్మి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. ''మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రాజమండ్రి సమీపంలో షూటింగ్ జరుగుతుంది'' అన్నారు ఎస్ఎస్ శాస్త్రీ.

రాకేష్ మాస్టర్ ఇకలేరు



తెలుగు చలన చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నృత్య దర్శకుడు ఎస్.రామారావు అలియాస్ రాకేష్ మాస్టర్(53) ఆదివారం మృతిచెందారు. వారం క్రితం ఓ సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం, భీమవరం వెళ్లి వచ్చిన ఆయన అప్పటినుంచి అనారోగ్యం పాలయ్యారు. ఆదివారం రక్త విరోచనాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రాంతంలో రాకేష్ మాస్టర్ జన్మించారు. ఆయన అసలు పేరు ఎస్.రామారావు. 10 ఏళ్ల వయస్సులో డిస్కో డాన్స్ చూసి డ్యాన్సర్‌గా మారాలనుకున్నారు. కానీ, ఎక్కడ నేర్చుకోవాలి? ఎవరు నేర్పుతారు? అని తెలియక టీవీలో వచ్చే పాటలను చూసి డ్యాన్స్ నేర్చుకున్నారు. ఆ తర్వాత తిరుపతి టౌన్‌కి వెళ్లి ఓ డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. తొలిరోజుల్లో కేవలం రూ.5 ఫీజుతో డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చేవారు. కొన్ని రోజుల తర్వాత సినిమా అవకాశాల కోసం చెన్నై వెళ్లారు. డాన్స్‌లు రాకపోవడంతో మళ్లీ తిరుపతికి వచ్చి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను నడిపారు. ఆ తర్వాత ముక్కు రాజు మాస్టర్ దగ్గర కొంతకాలం పనిచేశారు రాకేష్ మాస్టర్. 'ఆట', 'ఢీ' లాంటి డ్యాన్స్ రియాలిటీ షోల ద్వారా డ్యాన్స్ మాస్టర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టారాయన. 'ఢీ' షోలో బషీర్ అనే కుర్రాడికి మాస్టర్‌గా వ్యవహరిస్తున్న సమయంలో ఆ షోకి ఓ జడ్జిగా వ్యవహరించిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, నటుడు ప్రభుదేవాతో 'తెలుగు తెలిసిన వాళ్లే జడ్జిలుగా ఉండాలి' అంటూ కామెంట్స్ చేసి, వార్తల్లో నిలిచారు రాకేష్ మాస్టర్. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన 'చిరునవ్వుతో' లో 'నిన్నలా మొన్నలా లేదురా..' పాటతో సినిమాల్లో కొరియోగ్రాఫర్‌గా తొలి అవకాశం అందుకున్నారాయన. ఆ తర్వాత 'లాహిరి లాహిరి లాహిరిలో, దేవదాసు, సీతారామరాజు, యువరాజు, గర్ల్ ఫ్రెండ్, బడ్జెట్ పద్మనాభం, మనసిచ్చాను, సీతయ్య, అమ్మో పోలీసోళ్లు' వంటి దాదాపు 1500 చిత్రాలకుపైగా కొరియోగ్రఫీ చేశారు రాకేష్ మాస్టర్. 'గ్లోబల్ పీస్ యూనివర్సిటీ' నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారాయన. ప్రభాస్ వంటి పలువురు హీరోలకు డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. టాలీవుడ్‌లోని పలువురు స్టార్ హీరోలందరికీ కొరియోగ్రఫీ చేసిన ఘనత ఆయన సొంతం. ప్రస్తుతం తెలుగులో అగ్ర కొరియోగ్రాఫర్లుగా ఉన్న శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ రాకేష్ మాస్టర్ శిష్యులే కావడం విశేషం. ఓ టీవీ చానల్‌లో ప్రసారం అవుతున్న షోలో పలు స్కిట్లు చేసి, బుల్లితెర ప్రేక్షకుల్ని తనదైన శైలిలో నవ్వించారు రాకేష్ మాస్టర్. కొంతకాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. యూట్యూబ్ చానల్స్ వేదికగా పలువురు సెలబ్రిటీలపై వివాదాస్పద ఇంటర్వ్యూలు ఇచ్చి ఇటీవల మళ్లీ ట్రెండ్ అయ్యారాయన. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో వారి అభిమానుల నుంచి రాకేష్ మాస్టర్‌కి, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చేవి. ఈ కారణంగా ఆయన కుటుంబానికి దూరంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ అనాథ ఆశ్రమంలో ఉంటూ వచ్చారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు చరణ్‌తేజ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. రాకేష్ మాస్టర్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని బోరబండలో నేడు రాకేష్ మాస్టర్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే..

''ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు రాకేష్ మాస్టర్‌ని గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డయాబెటిక్ పేషెంట్ కావడం, సివియర్ మెటబాలిక్ ఎసిడోసిస్ కావడంతో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ అయి సాయంత్రం 5గంటలకు మృతి చెందారు'' అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు మీడియాకు తెలిపారు.

సంక్రాంతికి జాతర



● ప్రజ్వల్

కన్నడ నటుడు దేవరాజ్ పెద్ద కుమారుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించనున్న చిత్రం 'జాతర'. ఉదయ్ నందనవనమ్ దర్శకత్వంలో వర్ధమాన్, లోటస్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై గోవర్ధన్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ–''జాతర'కి మంచి కథ కుదిరింది. ప్రజ్వల్‌కి స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశారు. బి. వాసుదేవ్ రెడ్డి కథకు ఉదయ్ నందనవనమ్ ఇచ్చిన ట్రీట్మెంట్, స్క్రీన్ ప్లే 'జాతర' స్క్రిప్ట్‌ను మరింత కొత్తగా మార్చాయి. హైదరాబాద్, బళ్లారి లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం'' అన్నారు. ''ఈ సినిమాలో ప్రేమ కథ ఎంత అందంగా ఉంటుందో, నేపథ్యం కూడా అంతే కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా విడుదల చేస్తాం'' అన్నారు ఉదయ్ నందనవనమ్. పాన్ ఇండియా చిత్రంగా రూపొందనున్న ఈ మూవీకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.